బుడగ జంగాలకు లయన్స్ క్లబ్ చేయూత

సరుకులు అందజేసి వారితో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వేములవాడ, అక్టోబర్ 4: వేములవాడ పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వరద ప్రభావంతో మునిగిన బుడుగ జంగాల కుటుంబాలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ వంతు సహాయంగా ప్రతి కుటుంబానికి నాలుగు వేల రూపాయల విలువ గల 26 రకాల నిత్యావసర సరుకులు బ్లాంకెట్, బకెట్, వంట పాత్రలు కాలనీలోని 50 మందికి అందజేశామని తెలిపారు. లయన్స్ క్లబ్ మల్టిపుల్ చైర్మన్ హన్మాండ్ల రాజి రెడ్డి, డిస్టిక్ కోఆర్డినేటర్ తీగల వెంకటేశ్వర్ రావు, అధ్యక్షులు కటకం శ్రీనివాస్, గోగికారి శ్రీనివాస్, మారం కుమార్, శ్రీనివాస్, వరాల వెంకటకృష్ణ ఉన్నారు.

రాజన్న గోశాలలో అనారోగ్యంతో కోడెలు మృతి

వేములవాడ టౌన్ , అక్టోబర్ 4 : రాజన్న ఆలయానికి సంబంధిత మూడు కోడెలు మృతి చెందాయి. తిప్పాపురంలోని గోశాలలో ఎండ తీవ్రతకు, అనారోగ్యంతో మృతి చెందాయని వైద్యాధికారి వెల్లడించారు. శుక్రవారం మహాలక్ష్మీ ఆలయ వీధిలోని ప్రాంతంలో వాటిని ఖననం చేశారు. కాగా, రాజన్న ఆలయ గోశాలలో కోడెలు ఇలా మృత్యువాత పడుతుండడంతో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం గోశాలను పరిశీలించి, అధికారుల అలసత్వంపై విచారణ జరుపుతామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు, 20వ వార్డు కౌన్సిలర్ సంతోష్‌బాబు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన సుద్దాల ప్రభాకర్ తండ్రి బాలయ్య, నివాసం: పెద్దలింగాపూర్ తన వారసత్వ ఆస్తి మరియు కొనుగోలు చేసినటువంటి ఆస్తి అయినటువంటి పెద్ద లింగాపూర్ గ్రామశివారులోని సర్వే నెంబర్ 172/అ లో విస్తీర్ణం 0-21 గుంటలు, 172/ఇ లో విస్తీర్ణం 1-03 గుంటలు, సర్వే నెంబర్ 172/ఈ లో విస్తీర్ణం 1-03 గుంటలు మరియు సర్వేనెంబర్ 172/ఉ లో 1-03 గుంటల వ్యవసాయ భూమి కలదు. ఇట్టి భూమిలో పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి అట్టి భూమిని కబ్జా చేయాలని చూడడంతో నా క్లయింట్ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి సిరిసిల్ల న్యాయస్థానంలో వారిమీద దావా వేయడం జరిగింది. అట్టి దావా నెం. OS.177/2023 ఇట్టి దావా ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. అ దావా పెండింగ్‌లో ఉండగానే పోత్తురు గ్రామానికి చెందిన పోలే శ్రీనివాస్ తండ్రి కొమురయ్య అను అతను ఉద్దేశ పూర్వకంగా నా క్లయింట్ వ్యవసాయ భూమిని డాక్యుమెంట్ నెంబర్ 152/2024 ద్వారా కొనుగోలు చేయడం జరిగింది. నా క్లయింట్ పోలే శ్రీనివాస్ మీద కూడా అట్టి డాక్యుమెంటును రద్దు చేయాలని గౌరవ న్యాయస్థానంలో దావా వేయడం జరిగింది. అట్టి దావా ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. అట్టి దావా పెండింగ్ ఉండగానే పోలే శ్రీనివాస్ అను అతను మళ్లి అట్టి భూమిని అమ్మకానికి ప్రయత్నం చేస్తున్నాడు. కావున సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన సర్వే నెంబర్స్ మీద గౌరవ న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉన్నది కావున అట్టి భూములను ఎవరయిన కొనుగోలు చేసినచో వారికి ఎటువంటి యాజమాన్యపు హక్కులు సంక్రమించవు. తద్వారా న్యాయపరమైన (సివిల్ మరియు క్రిమినల్) సమస్యల్లో ఇరుక్కోవలసి వస్తుంది మరియు కోర్టు చుట్టు తిరగవలసి వస్తుందని తెలియజేయడం అయినది.

Sd/- కె. వెంకట్‌రెడ్డి, అడ్వకేట్
సెల్: 9502443432

CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

CHANGE OF NAME
I, S. SHANKAR S/o. SARLA ELLAIAH, R/o. H.No. 3-35, Kapulapalli village of Peddapalli mandal & district. TG, have Changed my name as SARLA SHANKAR S/o: SARLA ELLAIAH for all purpose.

DASARA OFFER
★Invest 15 Lakhs and get Monthly Income 10,000/- for more details Contact: Dr. Financial Consultants. 8106826332, 9391665516.
NT-333073

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

కొనసాగుతున్న ఇంటింటా డిజిటల్ సర్వే

వేములవాడ రూరల్, అక్టోబర్ 4: బొల్లారం గ్రామంలో ఇంటింటా కుటుంబ డిజిటల్ సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సుజాత డిజిటల్ సర్వేను పరిశీలించారు. దాదాపు 200 కుటుంబాల సర్వే పూర్తియిందన్నారు. కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ పరిశీలన

వేములవాడ రూరల్, అక్టోబర్ 4: మండలంలోని అరెపల్లి, అనుపురం, రుద్రవరం గ్రామశివారులోకి రాజరాజేశ్వర జలాశయం బ్యాక్ వాటర్ పంటచేన్లలోకి చేరగా, పంటలను తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ సతీశ్ పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు సూచించిన ప్రాంతం కంటే లోపలికి బ్యాక్ వాటర్ రావడంతోనే పంటలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. నష్టపరిహారం అందించాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

బోయినపల్లి, అక్టోబర్ 4 : వేములవాడ సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 9న చందుర్తి రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు బోయినపల్లి సెస్ ఏఈ ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం.. చందుర్తి రైతు వేదికలో వేములవాడ సబ్ డివిజన్ పరిదిలోని చందుర్తి, కోనరావుపేట, వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, బోయినపల్లి, రుద్రంగి మండలాలకు చెందిన వినియోగదారులు హాజరుకావాలని కోరారు. ఈ వేదికలో రైతులు తమ సమస్యలను పరిష్కారం చేసుకోవాలన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతుల పంపిణీ

వేములవాడ రూరల్, అక్టోబర్ 4: ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం సురక్షితమని ఆర్టీసీ కరీంనగర్ రిజనల్ మేనేజర్ సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ బస్టాండ్‌లో లక్కీడ్రా విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం సురక్షితంగా ఉంటుందన్నారు. డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, డిపో మేనేజర్ శ్రీనివాస్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 4 : అల్మాస్‌పూర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, రూ. 1.10 లక్షలు మంజూరయ్యాయి. కాగా, శుక్రవారం సదరు చెక్కులను మాజీ ఎంపీపీ రేణుక లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. అలాగే రాజన్నపేట, బొప్పాపూర్‌లోని పలువురికి మంజూరైన చెక్కులను బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పేద ప్రజలపై భారం

కోనరావుపేట, అక్టోబర్ 4: బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ద్వంద వైఖరిని వ్యవహరిస్తూ పేద ప్రజలపై భారం మోపుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు అన్నారు. మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో సీపీఎం గ్రామసభలు నిర్వహించగా ఆయన హాజరయ్యారు. ముందుగా సీపీఎం జెండాను అవిష్కరించారు. ఇక్కడ సీపీఎం శాఖ కార్యదర్శులు రాములు, పూజం జన, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు విమల, జిల్లా కార్యదర్శి భూషన్ రమేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్
- సిరిసిల్ల వైద్య ఆరోగ్యశాఖపై రివ్యూ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్

కలెక్టరేట్, అక్టోబర్ 4 : ప్రజలకు ప్రభుత్వ దవాఖానల ద్వారా మెరుగైన వైద్యం అందేలా పటిష్ఠ కార్యాచరణను అమలు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి సిరిసిల్ల వైద్య ఆరోగ్యశాఖపై సంబంధిత అధికారులతో కలిసి రివ్యూ నిర్వహించారు.ప్రభుత్వ దవాఖానలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య, సీజనల్ వ్యాధులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యకళాశాల, తెలంగాణ డయాగ్నస్టిక్ సేవలు, ప్రభుత్వ దవాఖానలో మందుల లభ్యత, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానలో అత్యధికంగా ప్రసవాలు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల పనితీరు నిరంతరం పర్యవేక్షించాలని, భ్రూణ హత్యలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ దవాఖానలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్స్ సేవల వివరాలు, వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ దవాఖానలో స్టాఫ్, ఖాళీల వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకున్న చర్యలను పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానకు వచ్చే ఔట్ పేషెంట్‌లను నిశ్చితంగా పరిశీలించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా వసంతరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్లు లక్ష్మీనారాయణ, పెంచలయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిటెయిల్స్ పకడ్బందీగా సేకరించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 4 : ఫ్యామిలీ డిటెయిల్స్ సర్వే వివరాలు పకడ్బందీగా సేకరించాలని జిల్లా ప్రత్యేకాధికారి, వైద్య, కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని 5వ వార్డులో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వేను కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో అధికారులు, సిబ్బంది సేకరిస్తున్న వివరాలు, పత్రాలు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ప్రతి కుటుంబ వివరాలు తీసుకోవాలని, జనన, మరణ వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానను సందర్శించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్, డీఎంహెచ్‌వో వసంతరావు, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, తదితరులున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు అభిషేక్

ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని గ్యాస్ సిలెండర్, స్టవ్‌లను కొనుగోలు చేస్తే అద్భుతమైన ఆఫర్ ఉందని హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకుడు అభిషేక్ శుక్రవారం తెలిపారు. కస్టమర్లు ఈ ఆఫర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోస్టర్‌ను అవిష్కరించారు.

క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేత

దుస్తులను పంపిణీ చేస్తున్న సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు

కోనరావుపేట, అక్టోబర్ 4: మండలంలోని వెంకట్రావుపేటలో మండల స్థాయి కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో పీయర్లెస్ ఫైటర్స్ జట్టు సభ్యులకు కొలనూర్ సింగిల్ విండో చైర్మన్ ఎస్ రామ్మోహన్‌రావు క్రీడా దుస్తులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకులు జిన్న అనిల్ కుమార్, జాగిరి కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే ధర్మారం గ్రామానికి చెందిన బీజేవైఎం జిల్లా ఉపాధ్యాక్షుడు మిర్యాలకర్ బాలాజీ ఆరెంజ్ వారియర్స్ జట్టుకి క్రీడా దుస్తులను అందజేశారు. నరేశ్, బాలకిషన్, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

జిల్లా వైశ్య సంఘంలో ఎన్నికల సందడి

- వేములవాడ నుంచి అధ్యక్ష స్థానానికి పోటీ
- రేపు నామినేషన్ ప్రక్రియ

వేములవాడ, అక్టోబర్ 4: జిల్లా ఆర్యవైశ్య మహాసభలో ఎన్నికల సందడి నెలకొంది. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లా ఆర్యవైశ్య మహాసభకు మొదటి దఫ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి అధ్యక్ష స్థానానికి అవకాశం ఇచ్చారు. ఇక మళ్లీ 2024-26 రెండు సంవత్సరాలకు గాను ఎన్నికలు రావడంతో ఈసారి వేములవాడ డివిజన్ నుంచి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష స్థానానికి పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడంతో వేములవాడలో ఎన్నికల హడావుడి మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆర్యవైశ్య మహాసభ సభ్యులు 3675 మంది ఉన్నారు. ఇందులో 25 మందికి ఒక ఓటు చొప్పున నిర్ణయించి సంఘం నాయకులు ఓటు హక్కును కల్పిస్తారు. దీంతో జిల్లా అధ్యక్ష స్థానానికి పోటీ చేసే వారికి 147 మంది ఓటు వేసే హక్కును వినియోగించుకోనున్నారు. ఇక వేములవాడ నుంచి అధ్యక్ష స్థానానికి బుస్స దశరథం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, కే శ్రీనివాస్ పోటీ చేస్తున్నట్లుగా సంఘంలో ప్రచారం చేస్తున్నారు. 6వ తేదీ ఆదివారం నామినేషన్, 8వ తేదీన నామినేషన్ల విత్‌డ్రా, 13న ఎన్నికలు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

లక్కీ డ్రా నిర్వాహకులపై కేసు నమోదు

చందుర్తి, అక్టోబర్ 4: బహుమతుల ఆశ చూపి లక్కీ డ్రా నిర్వహిస్తున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం చందుర్తి మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు లక్కీ డ్రా నిర్వాహకులు దుర్గామాత మండపాల వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లక్కీ డ్రా పేరా ఒక్కొక్కరి వద్ద చందుర్తిలో రూ.99, తిమ్మాపూర్‌లో రూ. 200 వసూలు చేస్తున్నారన్న సమాచారంతో వీ వెంకటేశ్, ఆర్ సాయి, దివాకర్, భూమరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు

ఫేక్ పోస్టులపై చర్యలు తీసుకోవాలి

ఠాణాలో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 4: సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు పోస్టులు పెడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ కార్యాలయంలో పట్టణ సీఐ కృష్ణను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మా నాయకుడు కేటీఆర్ ప్రతిష్ట దిగజారేలా ఆన్‌లైన్, ట్విటర్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని, కానీ సోషల్ మీడియా @టిడిఈ.టీం అకౌంట్ పేరుతో కొండా సురేఖ చెప్పింది నిజమే అని సినీ నటి సమంత చెప్పినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సదరు వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవిగౌడ్, మాట్ల మధు, గంగాధర్, వలకొండ గోపాల్‌రావు, కుంబాల మల్లారెడ్డి, సురభి నవీన్‌రావు, తదితర నాయకులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, అక్టోబర్ 4 : యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర హీరో షోరూంను శుక్రవారం ఆయన ప్రారంభించారు.నిర్వాహకుడు వెంకట్‌రెడ్డిని ప్రభుత్వ విప్ అభినందించారు. వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఇల్లంతకుంట, అక్టోబర్ 4 : మండలంలోని పొత్తూర్ మానేరు వాగుపై బ్రిడ్జిపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మహేశ్ తెలిపారు. రైతులకు అండగా నిలు స్తున్న ఆయను గ్రామస్తులు అభినం దించారు.

నేడు విదేశీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కలెక్టరేట్, అక్టోబర్ 4 : తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా విదేశాల్లో ఉద్యోగాలకు ఈ నెల 5న శనివారం రాజన్న సిరిసిల్లలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టామ్‌కామ్ గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాంట్, రొమేనియా, యూఏఈ, సౌదీ, యూకే వంటి వివిధ దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆమోదిత ఏజెన్సీలతో భాగస్వామ్యంతో ఈ ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 9440051285, 9440048500, 9701040062, 9440051452ను సంప్రదించాలని సూచించారు.

కోర్టు విధులను బహిష్కరించి న్యాయవాదుల నిరసన

కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

వేములవాడ, అక్టోబర్ 4 : న్యాయవాదులపై జరుగుతున్న దాడులు నిరసిస్తూ శుక్రవారం వేములవాడ కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ హైదరాబాద్ సిటీ కోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తున్న కలీం అనే న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడానికి తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన ఉద్యోగాల్లో ఉండి వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న పోలీస్ శాఖ తీరుపై చర్యలు తీసుకోవాలని తమ డిమాండ్ చేస్తున్నామన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్. కేశన్నగారి గోపికృష్ణ, కిషోర్ రావు, కొడిమ్యాల పురుషోత్తం, పిట్టల మనోహర్, నక్క దివాకర్, జంగం అంజయ్య, పర్లపెల్లి అంజయ్య, పారువెల్ల శ్రీనివాస్, పంపరి శంకర్, నేదూరి అభిలాశ్, జెట్టి శేఖర్, గుజ్జె మనోహర్, రేగుల రాజ్ కుమార్, బొజ్జ నరేశ్, అనిల్ కుమార్, దొబ్బల ప్రవీణ్, భాను కృష్ణ, మాదాసు దేవయ్య , ప్రశాంత్ కుమార్, తాహెర్ పాషా ఉన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

బహుమతుల ప్రదానం చేస్తున్న టౌన్ సీఐ కృష్ణ

తెలంగాణ చౌక్, అక్టోబర్ 4 : విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్‌లో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 క్రికెట్ పోటీలకు హాజరై విజేతలకు బహుమతులు అందజేసి, మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి స్కూల్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమస్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైన కరీంనగర్ జట్టు, రెండో స్థానంలో నిలిచిన సిరిసిల్ల జట్టు సభ్యులకు బహుతులు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో రాణించి పేరు తీసుకురావాలని సూచించారు. డీఈవో రమేశ్‌కుమార్, సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు లింగారెడ్డి ఉన్నారు.

మూడు కొలువులు సాధించిన యువకుడు

కోల సురేశ్

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 4 : మండలంలోని నేరేళ్లకు చెందిన కోల వినయ్‌కుమార్ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఎలాంటి కోచింగ్ లేకుండా, సొంత నోట్స్‌తో పక్కా ప్రణాళికతో పాటు రోజు వారి మోక్ టెస్ట్ రాస్తూ ఉద్యోగాలు సాధించడం విశేషం.. నేరెళ్లకు చెందిన కోల సురేశ్-లక్ష్మి దంపతులకు కుమారులు వినయ్‌కుమార్, సాయితేజ ఉన్నారు. సురేశ్ ఫర్టిలైజర్ దుకాణం నడుపుతూ కొడుకులను చదివించాడు. వినయ్ కుమార్ తన తల్లిదండ్రుల ప్రోత్సాహకంతో పాటు తన మామ అయిన పసుల స్వామి (పౌరసరఫరా శాఖ అధికారి)ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాడు. ప్రిపరేషన్‌లో ఉంటూ స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో జిల్లా స్థాయి ర్యాంకు 10 సాధించాడు. ఎస్జీటి జిల్లా ర్యాంక్ 38, వసతి గృహ సంక్షేమ అధికారి జోనల్ ర్యాంకు 58 రావడం గమనార్హం. తర్వాత గ్రూప్ 1 సాధించి, సమాజ సేవ చేస్తానని వినయ్‌కుమార్ తెలిపారు. మూడు ఉద్యోగాలు సాధించిన వినయ్‌కుమార్‌ను ఫీల్డ్ అసిస్టెంట్ స్వామితో పాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 4 : ఇటీవల ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకమైన రెడ్డీలకు ఆ సంఘం నాయకులు సన్మానించారు. శుక్రవారం మండల కేంద్రంలో సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు ముత్యాల సత్యంరెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి, కొంగరి కృష్ణారెడ్డి, జంగ శ్రీకాంత్‌రెడ్డి, మర్రి నారాయణరెడ్డి, గుల్లపల్లి లక్ష్మారెడ్డిని శాలువాతో సన్మానించారు. ఆ సంఘం నాయకులు వంగ గిరిధర్‌రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.

వర్గీకరణ అమలు చేయకుండా మోసం

మాట్లాడుతున్న ఎంఎస్‌పీ నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 4 : ఎస్సీ వర్గీకరణ అమలుచేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తు న్నారని ఎంఎస్పీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఎంఎస్పీ నాయకుడు ఆవునూరి ప్రభాకర్‌మాదిగ, గుండా థామస్‌మాదిగ, చంద్రమౌళి మాదిగ, జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ మాట్లాడారు. ఈ నెల 9న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఎమార్పీఎస్ కో కన్వీనర్ భేష్‌కుమార్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న బృందం సభ్యులు

న్యాక్ ట్రైనింగ్ సెంటర్ వద్ద బతుకమ్మ సంబురాలు

కలెక్టరేట్, అక్టోబర్ 4: రాజన్నసిరిసిల్ల జిల్లాలోని న్యాక్ ట్రైనింగ్ కేంద్రం వద్ద బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న న్యాక్ ట్రైనింగ్ కేంద్రం వద్ద న్యాక్ ఇన్‌చార్జి గోలి ప్రకాశ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.

కొలువుదీరిన అమ్మవారికి ఘనంగా పూజలు

వేములవాడ టౌన్: పూజ చేస్తున్న అర్చకులు

రుద్రంగి : సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

రుద్రంగి, అక్టోబర్ 4 : శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మహాలక్ష్మి వీధిలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద శుక్రవారం నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత మండపం వద్ద మహిళలు పాల్గొని సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు వివిధ మండపాల్లో కొలువుదీరిన అమ్మవారికి మండప నిర్వాహకులు ఘనంగా పూజలు నిర్వహించారు. గాంధీనగర్‌లోని అంజనీ యూత్ ఆధ్వర్యంలో బ్రహ్మచారిని అలంకారంతో ఉన్న అమ్మవారికి అర్చకులు శంకరాచారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, కుమారి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజనీయూత్ సభ్యులు మ్యాన రాజయ్య, సంతోష్, శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయ అభివృద్ధికి బండి హామీ

రామడుగు, అక్టోబర్ 4 : గుండిలోని పురాతనమైన వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజ్‌కుమార్ హామీ ఇచ్చారు. గుండి గ్రామానికి చెందిన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో కేంద్ర సహాయమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన బండి సంజయ్, ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, అభివృద్ధికి చేయూతనందిస్తానని హామీ ఇచ్చిన కేంద్ర సహాయమంత్రికి కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మడ్డి అంజయ్య, వైస్ చైర్మన్లు పొన్నం శ్రీనివాస్‌గౌడ్, మ్యాకల నాగరాజు, సభ్యులు రాజశేఖర్ ఉన్నారు.

పోక్సో కేసులో ఉపాధ్యాయుడి అరెస్టు

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 4: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సమాచారం. ఓ విద్యార్థిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపి సదరు ఉపాధ్యాయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. కాగా, ఈ ఉపాధ్యాయుడు రెండు నెలల్లో రిటైర్డ్ కాబోతున్నట్లు తెలిసింది